ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

గురువారం 10 ఏప్రిల్ 2025

తాగునీటి ఎద్దడి తలెత్తరాదు

చెరువుల అభివృద్ధికి నివేదికలు రూపొందించండి

సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్.. అధికారులను ఆదేశించారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో బుధవారం మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ, ఎన్టీఆర్ హౌసింగ్ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధికి ఎంత మేర నిధులు అవసరమో నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ముదిగుబ్బ మండలంలోని యోగివేమన రిజర్వాయర్ మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. చెరువుల అభివృద్ధికి ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, మైనర్ ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన పది మూల్యాంకనం



మూల్యాంకనం నిర్వహిస్తున్న టీచర్లు

కొత్తచెరువు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం బుధవారం ముగిసింది. మొత్తం 1,74,327 జవాబు పత్రాలు రాగా.. వాటిని మూల్యాంకనం చేసినట్లు డీఈఓ కిష్టప్ప తెలిపారు. తెలుగు 27,606, హిందీ 23,812, ఇంగ్లిష్ 21,676, గణితం 21,456, ఫిజికల్ సైన్స్ 28,584, బయాలజికల్ సైన్స్ 28,584, సోషల్ 19,804, సంస్కృతం 1587, ఒకేషనల్ 4,028 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారని డీఈఓ తెలిపారు.



కుంచించుకుపోయిన కృష్ణదేవరాయల సర్కిల్ రోడ్డు

పెనుకొండలో ఇష్టారాజ్యంగా బంకులు

కుచించుకుపోతున్న రహదారులు

చోద్యం చూస్తున్న అధికారులు

రోడ్డెక్కుతున్న ఆక్రమణలు

రాయల రెండో రాజధాని అయిన పెనుకొండ రోడ్లలో వెళ్లాలంటే నానా తిప్పలు పడాల్సిందే. రోడ్లు, ప్రధాన సర్కిళ్లలో సైతం విచ్చలవిడిగా ఆక్రమణలు వెలిశాయి. బంకులు వేసుకుని, రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో రోడ్లన్నీ కుంచించుకుపోయాయి. దీంతో పెనుకొండ సందర్శనకు వచ్చిన వారు ఈ రోడ్లపై వాహనాల్లో వెళ్లాలంటే ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ రోడ్లపై తిరగాలంటే స్థానికులు నరకం అనుభవిస్తున్నారు. తెలుగుతల్లి కూడలి, గాంధీ సర్కిల్, కృష్ణదేవరాయల, దర్గా కూడలి కుంచించుకుపోతున్నాయి. రేకుల బంకులు వేసి, ఆక్రమించుకుంటున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో వ్యాపారులు.. కార్యకలాపాలను రోడ్డుపై విస్తరిస్తున్నారు. ఇప్పటికైనా పెనుకొండ పట్టణంలోకి వచ్చే రహదారులపై ఆక్రమణలు తొలగించి రాకపోకలకు ఇబ్బందిలేకుండా చూడాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రోడ్డుపై నిలిపిన ద్విచక్రవాహనాలు



అద్దెకు తీసుకున్న రేకుల బంకులు



గాంధీ సర్కిల్‌లో కుంచించుకుపోయిన రహదారి

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పెనుకొండ ప్రధాన రహదారుల పక్కనున్న ప్రభుత్వ స్థలాల్లో రేకుల బంకులు యథేచ్ఛగా వేస్తున్నారు. పలువురు అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. నిరుపేదలు, చిరు వ్యాపారులు ఈ రేకుల బంకుల్లో రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు నెలకు అద్దె చెల్లిస్తూ నష్టపోతున్నారు. పెనుకొండలో ఈ బంకుల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇంత తంతు సాగుతున్నా.. అధికారులు చోద్యం చూస్తున్నారు. దాదాపు 200 రేకుల బంకుల్లో సొంతంగా 20 మంది వ్యాపారం చేసుకుంటుంటే మిగిలినవి అద్దెలకు ఇచ్చి మరో వ్యాపారం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ బంకులను తొలగించి, రోడ్ల విస్తరణ చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమించిన ప్రాంతాలు

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేయడం, అద్దెకు ఇచ్చుకోవడం పెనుకొండలో కొత్త వ్యాపారంగా మారింది. బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఇంటికి వెళ్లే రోడ్డుకిరువైపులా రేకుల బంకులు వెలిశాయి. గాంధీసర్కిల్, సబ్‌రిజిస్ట్రార్, ఆర్‌అండ్‌బీ కార్యాలయాలు, కోర్టు వద్ద, కృష్ణదేవరాయల విగ్రహం, దర్గా కూడలి రోడ్లను ఆక్రమించారు. వీటన్నింటిని తొలగించి మరోచోటికి మార్చిస్తే పెనుకొండలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బైక్‌లో వెళ్లాలన్నా ఇబ్బందులే..



పట్టణంలోని తెలుగుతల్లి, ఎస్కేడీ సర్కిల్, దర్గా కూడలి వరకు ద్విచక్ర వాహనంలో వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పవు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు.. ఆక్రమణలను తొలగించి, పెనుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.

- వడ్డె నాగభూషణ, పెనుకొండ

ఇది పర్యాటక ప్రాంతమా?

పట్టణంలో దాదాపు 360 దేవాలయాలున్నాయి. పెనుకొండ కొండకు రోడ్డు, జైన దేవాలయాలు, కోటగోడలు, ప్రసిద్ధి చెందిన బాబయ్యస్వామి దర్గా, ఊరువాకిలి ఆంజనేయస్వామి, గగన్మహల్, బసవన్నబావి, గాలిగోపురం ఇలా చెప్పుకుంటూ పోతే చాలా కట్టడాలున్నాయి. వీటిని తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. పట్టణంలో కుంచించుకుపోయిన రహదారులతో వారు ఇబ్బందులు పడుతున్నారు.



ఎస్కేడీ సర్కిల్‌లో కుంచించుకుపోయిన రహదారి

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి.. తొలగిస్తాం

పట్టణంలో సొంత రేకుల బంకులు వేసుకుని, జీవనాధారం పొందుతున్న వారి కన్నా.. అద్దెకు ఇచ్చుకున్నవారే ఎక్కువ. కుంచించుకుపోయిన రోడ్లపై బంకులు తొలగించి, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ఆర్డీఓకి నివేదించాం. ఎస్కేడీ సర్కిల్, దర్గా కూడలికి వెళ్లే దారిలో ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం.



- సతీష్‌కుమార్, కమిషనర్, నగర పంచాయతీ



ఆర్ అనంతపురం, సి కొడిగేపల్లి వద్ద సేకరించిన భూములు

మడకశిరకు మంచి రోజులు!

పారిశ్రామిక కారిడార్‌గా మారనున్న ప్రాంతం

- ఇప్పటికే భూములు సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం
- నిరుద్యోగులకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు
- మెరుగుపడనున్న మౌలిక సదుపాయాలు

మడకశిర రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక కారిడార్‌గా మడకశిర ప్రాంతాన్ని తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈక్రమంలో ఇప్పటికే మండలంలోని ఆర్. అనంతపురం, గౌడనహళ్ళి, ఛత్రం, సీ కోడిగేపల్లి పంచాయతీ పరిధిలో పరిశ్రమల కోసం భూములు సేకరించారు. ఆర్. అనంతపురం, గౌడనహళ్ళి, ఛత్రంలో 1600 ఎకరాలు, సీ కోడిగేపల్లి పంచాయతీలో మరో 1200 ఎకరాలు సేకరించారు. మడకశిర ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు అనువైన భూములు ఉండటంతో ఆ ప్రాంతానికి రావడానికి వివిధ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సంస్థ బీఈఎల్ పరిశ్రమ ఏర్పాటు కోసం ఆర్.అనంతరం వద్ద భూములను పరిశీలించారు.



ఆర్ అనంతపురం వద్ద పరిశ్రమల స్థాపనకు భూములను పరిశీలిస్తున్న ఏపీఐఐసీ అధ్యక్షుడు, గుండుమల (ఫైల్)

త్వరలో మరిన్ని పరిశ్రమలు

మడకశిర ప్రాంతంలో త్వరలో అనేక పరిశ్రమలు రానున్నాయి. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జిల్లా కలెక్టర్ చేతన్ ఆర్. అనంతపురం వద్ద భూములను ఇటీవల పరిశీలించారు. పరిశ్రమల స్థాపనకు అనువైన భూములు గుర్తించారు. రవాణా సౌకర్యాలు కూడా బాగా ఉండటంతో పరిశ్రమ స్థాపనకు సానుకూలమైన వాతావరణం ఉన్నట్లు పేర్కొన్నారు. భూములు ఇచ్చిన రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని సూచించారు. అందుకోసం స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



బుళ్లసముద్రం వద్ద సోలార్ పార్కు

త్వరలో బుళ్లసముద్రం వద్ద సోలార్ పార్కు ఏర్పాటు కానుంది. అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. బుళ్లసముద్రం, మణూరు, కల్లుమర్రి, హరేసముద్రం పంచాయతీ పరిధిలో వందల ఎకరాల భూములు బీళ్లుగా ఉన్నాయి. జింకల బెడద వల్ల రైతులు పంటలు సాగు చేయడం లేదు. ఈనేపథ్యంలోనే ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మూడు నెలలు కిందట సోలార్ ప్రాజెక్టు సంస్థ ప్రతినిధులను తీసుకువచ్చి భూములు పరిశీలించారు. అనంతరం రైతులతో సోలార్ పార్కు ఏర్పాటు విషయ మై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. సోలార్ పార్కు ఏర్పాటుతో బీడు భూములలో కూడా రైతులకు ఆదాయం రానుంది.

ఎదురుచూస్తున్న నిరుద్యోగులు

స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక, పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే నిరుద్యోగులు మడకశిర ప్రాంతంలో పరిశ్రమల స్థాపన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తే స్థానికంగానే ఉపాధి దొరుకుతుందని, వలస వెళ్లే అవస్థ తప్పుతుందని పేర్కొంటున్నారు. గత వైసీపీ పాలనలో ఆర్భాటమే తప్ప ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. ఆర్. అనంతపుం వద్ద ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విజయవాడ నుంచి ఆన్‌లైన్ నుంచి భూమి పూజ కూడా చేశారు. అయితే ఐదేళ్లలో ఒక్క ఇటుక కూడా పరిశ్రమ స్థాపనకు వేయలేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కాస్త చొరవ చూపి మడకశిర ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

నిరుద్యోగ సమస్య తీరుతుంది..



ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం మా కుటుంబం నుంచి 15 ఎకరాల భూమిని ఇచ్చాం. ఫ్యాక్టరీలు కడితే వలస కూలీలకు స్థానికంగానే ఉపాధి దొరుకు తుంది. నిరుద్యోగ సమస్య కొంత వరకు తీరుతుంది. మా ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలు రావాలని ఆశిస్తున్నాం.

-సీఆర్ వెంకటరెడ్డి, సీ కోడిగేపల్లి



ఏపీఐఐసీ ఏర్పాటు చేసిన బోర్డు

ఆర్థికంగా అభివృద్ధి: లక్ష్మీనారాయణ, టీడీపీ మండల కన్వీనర్, మడకశిర



మడకశిర ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటైతే ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయి. వలస వెళ్లిన వారు సైతం తిరిగి స్వగ్రామాలకు వస్తారు. స్థానికంగా మౌలిక సదుపాయాలు పెంపొందుతాయి. రోడ్లు మరింత అభివృద్ధి చెందుతాయి. మొత్తంగా మడకశిర ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది.

అంతా నేనే..!

ఎంపీడీఓ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తి అక్రమాలు

కంప్యూటర్ ఆపరేటర్ ముసుగులో అక్రమ వసూళ్లు

పంచాయతీ కార్యదర్శులూ ఆయన మాట వినాల్సిందే..!



కంప్యూటర్ ఆపరేటర్ చుట్టూ కూర్చున్న పంచాయతీ కార్యదర్శులు

గాండ్లపెంట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'అధికారులంతా నాచేతుల్లో ఉన్నారు. వారికి నేను ఎంత చెబితే అంత. కాబట్టి మీ పనులు జరగాలంటే నాకు ముడుపులు అందాల్సిందే' అంటూ ఓ ప్రైవేటు వ్యక్తి ఎంపీడీఓ కార్యాలయంలో పెత్తనం చేస్తున్నాడు. గాండ్లపెంట ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు వివిధ పనుల నిమిత్తం కంప్యూటర్ ఆపరేటర్‌గా ఓ ప్రైవేట్ వ్యక్తిని నియమించుకున్నారు. పంచాయతీ కార్యదర్శులకు కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడంతో వారికి సంబంధించిన లాగిన్లు, పాస్‌వర్డులు అన్నీ అతడికే అప్పగించారు. దీంతో కంప్యూటర్ ఆపరేటర్ అక్రమాల్లో చెలరేగిపోతున్నాడు. పింఛన్ మంజూరు వ్యవహారంలో ఇతడి ఆగడాలకు హద్దులేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి పింఛన్‌కు ఓ రేటు కుదుర్చుకుని, ఆధార్‌కార్డుల్లో వయసు, ఒంటరి మహిళ, చేనేత, డప్పు కార్మికుల, వికలాంగులు, వృద్ధాప్య పింఛన్లను పెంచేశాడు. ఇదంతా పంచాయతీ కార్యదర్శుల లాగిన్ నుంచే కావడం గమనార్హం.

ఆయన చెప్పిన సమయానికే..!

మండలంలో 14 పంచాయతీలున్నాయి. ప్రతి పంచాయతీలో ఇంటి, నీటితో పాటు వివిధ రకాల పన్నుల, పలు అభివృద్ధి పనుల బిల్లులు కంప్యూటర్ ఆపరేటరే చేయాల్సి ఉంది. దీంతో పంచాయతీ కార్యదర్శులు అతడిపై ఆధారపడుతుంటారు. వారు పనిమీద ఎంపీడీఓ కార్యాలయానికి వెళితే కంప్యూటర్ ఆపరేటర్ చెప్పిన సమయంలోనే రావాల్సి ఉంది. లేదంటే వారి పనులు చేయకుండా ఆపివేస్తున్నట్లు సమాచారం. దీంతో పంచాయతీ కార్యదర్శులు ఆయన చెప్పినట్లుగా వినక తప్పడంలేదు. ప్రైవేటు వ్యక్తి ఎంపీడీఓ కార్యాలయంలో పాగా వేసి, అక్రమాలకు పాల్పడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది. పలు గ్రామాల్లో ఇంటిపన్నుల రసీదులు కూడా అడ్డగోలుగా మార్చి ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.

చెత్త కార్మికులు కూడా చేయి తడపాల్సిందే

పంచాయతీల్లో చెత్త కార్మికులు చాలీచాలని జీతంతో జీవిస్తున్నారు. ఆరు నెలలు, ఏడాదికి ఒకసారి వచ్చే చెత్త కార్మికుల జీతాలను కూడా కం ప్యూటర్ ఆపరేటరే చేయాల్సి ఉంది. డబ్బులిస్తేనే వారి వివరాలు నమోదు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీ అధికారులు కూడా కంప్యూటర్ ఆపరేటర్‌కు అంతో ఇంతో చెల్లించి త్వరగా బిల్లులు చేయించుకోవాని చెబుతున్నారేకాని, అవినీతికి అడ్డుకట్ట వేయడం లేదు. దీనిపై కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విచ్చలవిడిగా ధ్రువీకరణ పత్రాల జారీ

ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి విచ్చలవిడిగా జనన, మరణాల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించినట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల విద్యార్థులకు అపార్ ఐడి నమోదు చేసుకోవా లని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల ఆధార్‌లో తప్పులుంటే వాటిని సవరించి అపార్ ఐడీలో నమోదు చేయించుకోవాల్సి ఉంది. అయితే పుట్టిన తేదీ మార్చుకోవాలంటే వీఆర్‌ఓ, తహసీల్దార్, ఆర్డీవో వరకు వెళ్లాల్సి ఉంది. ఈతంతు కొనసాగాలంటే దాదాపు నెలకు పైగా గడువు పట్టేది. అయితే కంప్యూటర్ ఆపరేటర్ మాత్రం అవసరమున్నవారితో డబ్బులు తీసుకుని పుట్టిన తేదీలు అడ్డగోలుగా మార్చిన సంఘటనలు అనేకమున్నాయి. ఇవేకాకుండా పలు పింఛన్ల తయారీలో భారీగా అక్రమాలు జరిగినట్లు సమాచారం.

ప్రైవేటు వ్యక్తి పని చేయరాదు

ప్రైవేటు వ్యక్తి ఎంపీడీఓ కార్యాలయంలో పని చేయకూడదు. ఈఓఆర్‌డీ, కార్యదర్శులు కంప్యూటర్ ఆపరేటర్‌తో పనులు కార్యాలయంలో చేయించుకుంటున్నారు. పలుమార్లు బయట చేయించుకోవాలని హెచ్చరించా. ఇలాగే పునరావృతమై ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం.

-వెంకట్రామిరెడ్డి, ఎంపీడీఓ, గాండ్లపెంట

రక్షణగా వచ్చిన పోలీసులనే అంటారా..?

జగన్‌పై పల్లె సింధూర, పల్లె రఘునాథరెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న పల్లె సింధూరారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'పరామర్శకు వచ్చిన మీకు రక్షణ కల్పించిన పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా మాట్లాడటం తగునా..?' అని మాజీ సీఎం జగన్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రశ్నించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. పోలీసుల బట్టలు ఊడదీసి రోడ్డుపై నెలబెడతామని ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. జగన్ వెంటనే పోలీసులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'ప్రకృతి వైపరీత్యాలు, మహిళలపై దాడులు జరిగినా ఏనాడూ మీరు బాధితులను పరామర్శించేందుకు రాలేదు. కార్యకర్తలను రెచ్చగొట్టేందుకు జిల్లాకు వచ్చారు. అయినా మీ పర్యటనకు ప్రభుత్వం 1100 మంది పోలీసులు, ఇద్దరు ఎస్పీలు, 8 మంది డీఎస్పీలతో బందోబస్తు ఏర్పాటు చేసింది. హెలీప్యాడ్ వద్ద 250 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది.' అని అన్నారు. రూ.5.50 కోట్లు ఖర్చుచేసి పాపిరెడ్డిపల్లి పర్యటనకు వచ్చిన జగన్.. లింగమయ్య కుటుంబానికి నయా పైసా ఇవ్వకుండా వెళ్లారని విమర్శించారు. విధ్వంసాలు సృష్టించాలన్నదే జగన్ ఉద్దేశమని ఆరోపించారు.

ఈతాకుకు యమా డిమాండ్



అరటి పిలకల సంరక్షణకు వినియోగం

ఈత పట్ట రూ.3

ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్న రైతులు

ఈత పట్టలను గతంలో కోసుకొచ్చి, ఆకులను తొలగించి కర్రలతో బుట్టలు, జల్లలు అల్లేవారు. రానురాను వాటిని అల్లేవారు కరువయ్యారు. కొనే వారూ లేరు. దీంతో ఈత పట్టలను కోసేవారు కనిపించకుండా పోయారు. అనూహ్యంగా ప్రస్తుతం వాటికి డిమాండ్ ఏర్పడింది. ఎండల నుంచి అరటి పిలకలను రక్షించుకునేందుకు రైతులు ఈత పట్టలను వినియోగిస్తున్నారు. మండలంలో ఈత చెట్లు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి రైతులు తెచ్చుకుని మరీ.. తోటల్లో వాడుతున్నారు. దీంతో వాటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఒక్కో ఈత పట్ట రూ.3తో అమ్ముడుపోతోంది. ఈత పట్టల వ్యాపారం కూడా జోరందుకుంది.

-ఆంధ్రజ్యోతి, పుట్లూరు

పుట్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో అరటి పిలకలను నాటుతారు. భానుడి ప్రతాపం నుంచి వాటిని సంరక్షించుకోవడం రైతులకు పెను సవాలే. ఎలాగైనా మొక్కను రక్షించుకోవాలని వినూత్నంగా ఆలోచించిన రైతన్న అరటి పిలకలకు ఈతాకును రక్షణ కవచంగా ఉపయోగిస్తున్నాడు. దీంతో అరటి పిలకలకు ఎండ వేడిమి తగలకుండా ఈతాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. మండలవ్యాప్తంగా 2500 ఎకరాలకుపైగా ఈతాకుచాటున అరటి నాటారు. పుట్లూరు, కడవకల్లు, దోసలేడు, చెర్లోపల్లి, ఓబులాపురం, మడ్డిపల్లి, మడుగుపల్లి, ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, కొండుగారికుంట, రంగమనాయునిపల్లి, రంగరాజుకుంట, కుమ్మనమల, చాలవేముల తదితర గ్రామాల్లో అరటి ఎక్కువగా సాగుచేస్తున్నారు. అరటి పిలకల పక్కనే ఈతాకు నాటుతున్నారు. దీంతో ఎండవేడిమి పూర్తిగా ఈతాకు మీద పడుతోంది. వెరసి అరటి పిలక ఎదుగుదలకు ఇబ్బంది లేకుండా పోతోంది. దీంతో ఏప్రిల్, మే నెలల్లో మొక్కలు నాటే రైతులు ఎక్కువగా ఈతాకుపైనే మక్కువ చూపుతున్నారు. గతంలో కాగితాలను అరటి పిలకలకు రక్షణగా ఉంచేవారు. అవి ఎండవేడిమిని పూర్తిగా నియంత్రించినప్పటికీ మొక్కలో పెరుగుదల కనిపించకపోవడంతో రైతులు ఈతాకు ఉపయోగిస్తున్నారు.



అరటి పిలకలకు ఈత ఆకును రక్షణ కవచంలా ఏర్పాటు చేసిన దృశ్యం

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

అరటి రక్షణ కవచంగా ఉపయోగించే ఈతాకు పరిసర ప్రాంతాల్లో లేకపోవడంతో ఆత్మకూరు, ఉరవకొండ, ఆలూరు, చెన్నేకొత్తపల్లి, సనప, ఆదోని, గుత్తి తదితర ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు ఆటోల్లో తీసుకొచ్చి, రైతులకు విక్రయిస్తున్నారు. నెలరోజుల క్రితం ఈతాకు కొమ్మ రూ.2.50 ఉండగా.. డిమాండ్ పెరగడంతో ప్రస్తుతం రూ.3తో విక్రయిస్తున్నారు. ఎకరాకు 1,300 అరటి పిలకలకు ఒక్కో దానికి ఒక్కో కొమ్మ ఏర్పాటు చేస్తున్నారు. ఈ లెక్కన ఎకరాకు రవాణా ఖర్చుతో సహా దాదాపు రూ.4వేల మేర రైతు భరించాల్సి వస్తోంది.

ఈతాకుతో లాభమే..



అరటి పిలకలకు ఈతాకు రక్షణగా ఏర్పాటు చేయడం లాభదాయకమే. ఐదెకరాల్లో అరటి నాటా. ఎకరాకు సరిపడా ఈత ఆకు కోసం రూ.4 వేలు ఖర్చు చేశా. రైతులు అందరూ ఈతాకు వాడుతుండడంతో డిమాండ్ పెరిగింది.

- రామాంజులరెడ్డి, రైతు, రంగరాజుకుంట

డిమాండ్ ఏర్పడడంతో విక్రయిస్తున్నా..



గతంలో నేను సాగుచేసిన అరటి పంటకు ఈతాకు కొనుగోలు చేశా. రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో నేనే ఇతర ప్రాంతాల నుంచి కోత కోసి, తీసుకొచ్చి విక్రయిస్తున్నా.

- సతీష్, ఎల్లుట్ల గ్రామం



ఈత పట్టలు

వచ్చే సీజన్‌కు పనులు పూర్తి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): టీబీ డ్యాం నుంచి నీటి విడుదల చేసే సమయానికి హెచ్చెల్సీ కింద చేపడుతున్న పనులన్నీ పూర్తి చేస్తామని ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. సుమారు రూ.50కోట్లకు పైగా నిధులతో హెచ్చెల్సీ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలు ఇలా

ప్రశ్న: హెచ్చెల్సీ పరిధిలో ఎంత ఆయకట్టు ఉంది?

ఎస్ఈ: హెచ్చెల్సీ పరిధిలో 2,85,743ఎకరాల ఆయకట్టు ఉంది. అనంతపురం జిల్లాలోనే అత్యధికంగా 1,45,987ఎకరాల ఆయకట్టు ఉంది. కర్నూలు జిల్లాలో 14,255 ఎకరాలు, కడప జిల్లాలో 1,25,501ఎకరాల ఆయకట్టు ఉంది.

ప్రశ్న: 2024-25 సంవత్సరానికి సంబంధించి హెచ్చెల్సీకి ఎంత నీరు టీబీ డ్యాం నుంచి కేటాయించారు ?

ఎస్ఈ: టీబీ డ్యాంలో 198.50టీఎంసీల నీటి నిల్వ ఆధారంగా హెచ్చెల్సీ 2024-25 సంవత్సరానికి గాను 33.930టీఎంసీల నీటిని కేటాయించారు. ఏపీ బోర్డర్ 105కిలోమీటరు వద్దకు 29.626టీఎంసీల నీరు చేరింది.

ప్రశ్న: ఎంత నీటిని ఏయే వాటికి ఉపయోగించారు....?

ఎస్ఈ: జిల్లా సరిహద్దుకు చేరిన 29.626టీఎంసీల నీటిలో తాగునీటి కోసం 8.278టీఎంసీల నీటిని ఉపయోగించాం. 13.791టీఎంసీల నీటిని 90,355ఎకరాల ఆయకట్టుకు అందించాం. 33 చెరువులకు 5.04టీఎంసీల నీటిని నింపాం. ఇక 4.215టీఎంసీల నీరు రిజర్వాయర్లలో నిల్వ ఉంది.

ప్రశ్న: హెచ్చెల్సీ పరిధిలో ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి....?

ఎస్ఈ: హెచ్చెల్సీ పరిధిలో కణేకల్లు పెద్ద చెరువు, పీఏబీఆర్, ఎంపీఆర్, సుబ్బరాయసాగర్, ముచ్చుకోట రిజర్వాయర్, చాగల్లు, మైలవరం రిజర్వాయర్లు ఉన్నాయి. వీటితో పాటు మైనర్ ఇరిగేషన్ పరిధిలోని పలు చెరువులకు, ఆయకట్టుకు హెచ్చెల్సీ నీరు ఇస్తున్నాం.

ప్రశ్న: గడిచిన ఐదేళ్లలో హెచ్చెల్సీలో ఏయే పనులు చేపట్టారు...?

ఎస్ఈ: గడిచిన ఐదేళ్ల కాలంలో ఒక్క పనికూడా చేయలేదు. అనేక పనులకు నాలుగైదు దఫాలుగా ప్రభుత్వానికి, జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా...అనుమతి ఇవ్వలేదు, నిధులు ఇవ్వలేదు.

ప్రశ్న: ప్రస్తుతం ఏయే పనులు చేపడుతున్నారు?

ఎస్ఈ: ఇప్పటికే హెచ్ఎల్ఎంసీ ప్రధాన కాలవ మీద 25పనులు రూ.2.92కోట్లతో ప్రారంభించాం. మరో 11పనులు హెచ్చెల్సీ పరిధిలో రూ.37కోట్లతో త్వరలో చేపట్టాలి. మరో 183పనులకు రూ.14కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. అన్ని పనులు వచ్చే నీటి విడుదల సీజన్ సమయానికి పూర్తి చేయాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం.

క్షయ నిర్మూలనకు అంకితభావంతో పనిచేయాలి

డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్

అనంతపురం టౌన్, ఏప్రిల్9(ఆంధ్ర జ్యోతి): క్షయ నిర్మూలనకు ప్రతిఒక్కరు అంకితభావంతో పనిచేయాలని డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్ సూచించారు. ఆస్పత్రిలోని టీబీ యూనిట్‌లో బుధవారం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమజేమ్స్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో టీబీ కేసులు, నిర్ధారణ పరీక్షలు తదితర అంశాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్షయ నిర్ధారణకు ప్రత్యేక సర్వే చేశారన్నారు. అనుమానిత లక్షణాలున్న వారికి ఉచితంగా పరీక్షలు, చికిత్సలు, మందులు ఇస్తామన్నారు. ప్రజలకు ఈవ్యాధిలక్షణాల పట్ల అవగాహన కల్పించి వెంటనే వైద్యం పొందేలా చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్‌సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంత్



పెన్నహోబిలం నర్సరీలో సమస్యపై చర్చిస్తున్న డీఎఫ్ఓ విఘ్నేష్..

నర్సరీల్లో అవినీతి మొక్కలు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలు అక్రమాలకు అడ్డాగా మారా యనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రికార్డుల్లో మొక్కలను లక్షల్లో పంపిణీ చేసినట్లు చూపుతున్నారు. కానీ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళితే నర్సరీల్లో మొక్కలు కనిపించవు. ఇలా మసిపూసి మారేడు కాయ చేసి నిధులు స్వాహా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బిల్లుల మంజూరులో కూడా పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. సోషల్ ఫారెస్ట్ విభాగంలో రెగ్యులర్ డీఎఫ్ఓలు లేకపోవడం కిందిస్థాయి సిబ్బందికి వరంగా మారిందన్న ప్రచారం ఉంది.

ఒక్కరే 10.5 లక్షలు..!

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నర్సరీల్లో మొక్కల పెంపకానికి సంబంధించి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసింది. సోషల్ ఫారెస్ట్ విభాగం నుంచి ఈ ఏడాది 30 లక్షల మొక్కలు నర్సరీల్లో పెంచేలా అంచనాలు తయారు చేశారు. ఇందులో ఇప్పటికే 15 లక్షల మొక్కలు నర్సరీల్లో గ్రౌండ్ అయినట్లు అధికారులు పేర్కొన్నారు. మరో 15 లక్షల ఎత్తైన మొక్కలు వచ్చే ఏడాదికి పంపిణీ చేసేలా నర్సరీల్లో గ్రౌండ్ చేయడానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గ్రౌండ్ అయిన 15 లక్షల మొక్కల సంరక్షణకు సోషల్ ఫారెస్ట్‌లో జిల్లా వ్యాప్తంగా ఇద్దరు మాత్రమే సిబ్బంది ఉన్నారు. ఇందులో ఓ మహిళా సిబ్బంది ఒక్కరే 10.5 లక్షల మొక్కలు సిద్ధం చేసినట్లు రికార్డులు నమోదు చేశారు. మరో 4.5 లక్షలు మిగిలిన నర్సరీల్లో పెంచుతున్నట్లు రికార్డులు నమోదు చేశారు. అయితే క్షేత్రస్థాయిలో లేని మొక్కలను రికార్డుల్లో చూపి అందరికీ పంపిణీ చేశామని చెప్పి, నిధులు స్వాహా చేసే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కూలీల బిల్లులు స్వాహా..!

పెన్నహోబిలంలో ఉన్న నర్సరీకి సంబంధించి అక్కడ పని చేసిన కూలీలకు 2021-22 నుంచి ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు బకాయి చెల్లించాల్సి ఉంది. అయితే మంజూరైన బిల్లులను నర్సరీలు నిర్వహించే సిబ్బంది స్వాహా చేశారన్న ప్రచారం జరుగుతోంది. ఎప్పుడు బిల్లులు మంజూరైనా కేవలం మెటీరియల్ బిల్లులు మాత్రమే పడ్డాయని చెబుతూ కూలీలకు సొమ్ము ఎగ్గొడుతున్నట్లు సమాచారం. దీంతో నర్సరీల్లో పని చేసేందుకు కూలీలు ఎవరూ ముందుకు రావడం లేదని తెలిసింది. ఇలా గత ఐదేళ్లుగా వచ్చిన నిధులను అక్కడి సిబ్బంది దిగమింగి తమకు ఏమి తెలియదన్నట్లు వ్యవరిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. నాలుగు రోజుల కిందట సోషల్ ఫారెస్ట్ ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ విఘ్నేష్ పెన్నహోబిలం నర్సరీని తనిఖీ చేశారు. అక్కడ మొక్కలు పెంచడానికి పాలిథిన్ కవర్లలో నింపడానికి తోలిచ్చిన మట్టి తప్ప మరో మెటీరియల్ కనిపించలేదు. గతంలో అక్కడ పని చేసిన సిబ్బంది నిర్వాకంతోనే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని కూలీలు చెప్పడంతో డీఎఫ్ఓ ఖంగుతిన్నారు. డీఎఫ్ఓ విజిట్ నేపథ్యంలో అక్కడికి వెళితే తమ అక్రమాల గురించి కూలీలు బయటపెడతారనే భయంతో పలువురు సిబ్బంది ఎస్కేప్ అయినట్లు తెలిసింది.



ఏడాదిన్నర తర్వాత..

సర్వజనాస్పత్రిలో పోస్టుల భర్తీకి అడుగులు.. దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి

అనంతపురం టౌన్, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో కాంట్రాక్టు వైద్యపోస్టుల భర్తీకి అడుగులు పడుతున్నాయి. గత వైసీపీ హయాంలో 2023 నవంబరులో మొత్తం 72 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో ఎంఆర్ఐ, ఎంఆర్ఎస్, ఓటీ టెక్నీషియన్లు, ఫిజియోథెరపిస్ట్, సైకియాట్రిక్ సోషల్ వర్కర్, స్పీచ్ థెరపిస్ట్, నెట్ అడ్మినిస్ట్రేటర్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్, పెర్ఫ్యూజినిస్ట్, అటెండర్ పోస్టులు ఉన్నాయి. వీటికి అప్పట్లో 2400కిపైగా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు అందాయని వైద్యాధికారులు అంటున్నారు. ఆ తర్వాత ఆలస్యం కావడం, ఎన్నికలు రావడంతో నియామకాల ప్రక్రియ అప్పట్లో నిలిచిపోయింది. దీంతో అభ్యర్థులు గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ కావడంతో ఇక అది చెల్లదని భావించి, నియామకాల గురించే మరచిపోయారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఏడాదిన్నర క్రితం ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఆ పోస్టులను భర్తీ చేసుకోవాలని రాష్ట్ర వైద్య శాఖాధికారులు ఆస్పత్రి వర్గాలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నాటి నోటిఫికేషన్ ఆధారంగా అటెండర్ పోస్టులు నాలుగు మినహా 68 పోస్టులను యథాతథంగా భర్తీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో గతంలో వచ్చిన నోటిఫికేషన్ల ఆధారంగా వచ్చిన దరఖాస్తుల పరిశీలనను ఇపుడు మళ్లీ మొదలు పెట్టారు. సంబంధిత సెక్షన్ ఆఫీసర్లతో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి బుధవారం దరఖాస్తులను పరిశీలించారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకే పాత నోటిఫికేషన్ ప్రకారం వచ్చిన దరఖాస్తులను పక్కాగా పరిశీలించి, పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టి అర్హులకే అవకాశం కల్పిస్తామని మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఏడాదిన్నర తర్వాత పాత నోటిఫికేషన్ ఆధారంగా పోస్టుల భర్తీకి ఆస్పత్రి అధికారులు శ్రీకారం చుట్టడంతో ఆశలు వదిలేసిన అభ్యర్థులు.. ఆనందం వ్యక్తం చేస్తున్నారు

చాంపియన్ కాకినాడ

రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ ఫైనల్లో తిరుపతిపై గెలుపు

ధర్మవరంలో జాతీయస్థాయి టోర్నీ నిర్వహణకు కృషి: మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ టోర్నీలో కాకినాడ జిల్లా జట్టు చాంపియన్‌గా అవతరించింది. హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం నిర్వహించిన ఫైనల్లో తిరుపతి జిల్లా జట్టుతో తలపడింది. కాకినాడ జట్టు 2-0 గోల్స్ తేడాతో తిరుపతిపై ఘన విజయం సాధించి, ట్రోఫీని కైవసం చేసుకుంది. తిరుపతి రన్నరప్‌గా నిలిచింది. అన్నమయ్య జిల్లా జట్టు మూడోస్థానంతో సరిపెట్టుకుంది. బహుమతుల ప్రదానోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. విజేత, రన్నరప్, మూడో స్థానంలో నిలిచిన జట్లకు ట్రోఫీలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. త్వరలో ధర్మవరంలో జాతీయస్థాయి టోర్నీ నిర్వహించేందుకు తోడ్పాటు అందిస్తానన్నారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, రాష్ట్ర కోశాధికారి థామస్ పీటర్, జిల్లా ప్రధానకార్యదర్శి బందనాధం సూర్యప్రకాశ్, కోచ్ హుస్సేన్ పాల్గొన్నారు.



విజేత కాకినాడ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

పాడి రైతుకు ధీమా

మేలుజాతి ఆవులు



పశువులు, మేకలు, గొర్రెలకు బీమా అమలు

నామమాత్రపు ప్రీమియంతో భారీ ప్రయోజనం

ఒక్కసారి చెల్లిస్తే మూడేళ్ల కాలానికి అమలు

బొమ్మనహాళ్/రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రమాదవశాత్తు మూగజీవాలు మృత్యువాత పడితే ఆయా కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడానికి గతంలో ఉన్న పశు బీమా పథకాన్ని పునఃప్రారంభించింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పశుబీమా ద్వారా ఎంతో మంది రైతులను ఆదుకున్నారు. వైసీపీ పాలనలో పథకం నిర్వీర్యమైంది. పశువులను కోల్పోయిన రైతులు బీమా రాక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అయితే మళ్లీ పశుబీమా పథకాన్ని ప్రారంభించడంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఒక కుటుంబానికి 5 పశువుల వరకు బీమా వర్తిస్తుంది.

ప్రీమియంపై రాయితీ

బీమా ప్రీమియంలో రాష్ట్ర ప్రభుత్వం భారీ రాయితీ ఇస్తోంది. మూడేళ్ల కాలం ఉండే బీమాకు 85శాతం సబ్సిడీ ఇస్తోంది. రూ.15 వేల బీమాకు ప్రీమియం రూ. 960లు చెల్లించాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వం సబ్సిడీ రూ.768 పోను రైతు వాటాగా రూ.192 చెల్లించాలి. రూ.30వేల బీమాకు ప్రీమియం రూ.1920. ప్రభుత్వ సబ్సిడీ 1536 రైతు వాటా కింద రూ.384 చెల్లించాలి. రూ.40 వేల బీమాకు ప్రీమియం 2560. సబ్సిడీ రూ.1536 పోగా రైతు వాటా రూ. 1024 చెల్లించాల్సి ఉంటుంది. గొర్రెలు, మేకల పెంపకందారులకు ఒక కుటుంబానికి సంవత్సరానికి 50 జీవాల వరకు బీమా వర్తిస్తుంది. 6నెలలు, ఆపై వయస్సు కలిగిన గొర్రెలు, మేకలకు రూ.6వేల వరకూ బీమా వర్తిస్తుంది. పెంపకందారులు సంవత్సరానికి రూ.36 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. పశుపోషకులు, గొర్రెలు, మేకలు పెంపకదారులు దగ్గరలో ఉన్న పశువైద్యశాలలో బీమా చేయించుకోవచ్చు. బీమా ప్రీమియం చెల్లించిన పశువు చెవికి ట్యాగ్ వేస్తారు. పశువు చనిపోయినప్పుడు చెవి ట్యాగ్ ఆధారంగా బీమా చెల్లిస్తారు.



నిబంధనలు ఇవే..

బీమా కావాలనుకునే రైతులు బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు, ఎస్సీ, ఎస్టీలైతే తెల్లరేషన్‌కార్డు జిరాక్సు కాపీలను జతపరచాలి. పశువులు మృతి చెందిన వెంటనే సమీపంలోని రైతు సేవ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. బీమా సర్వే సిబ్బంది వచ్చేవరకు పశువులకు వేసిన ట్యాగ్‌ను తొలగించకుండా ఉండాలి. బీమా చేసిన పశువులను విక్రయిస్తే ఏడురోజుల్లోగా కంపెనీ వారికి తెలియజేసి కొనుగోలుదారుడి పేరుపైన మార్చాలి. ఈ నిబంధనలపై సంబంధిత అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అవగాహన కల్పించాలి



పశులకు బీమా సౌకర్యంపై గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషకులకు అవగాహన కల్పించాలి. గతంలో రైతులు ప్రీమియం చెల్లించినా పరిహారం అందలేదు. అందుకే ఈ పథకంపై నమ్మకం లేకుండాపోయింది. అందుకే రైతులు బీమా చెల్లించేందుకు వెనుకంజ వేస్తున్నారు.

- సాంబశివరావు, పాడి రైతు, ఎల్‌బీ నగర్, బొమ్మనహాళ్ మండలం

అవగాహన కల్పిస్తున్నాం



పశుబీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి రైతు తమ పాడి పశువులకు బీమా చేసుకునేలా అవగాహన కల్పించి, ట్యాగులు వేసుకునేలా చూస్తున్నాం. ప్రభుత్వం అందించే రాయితీలు, ఉపయోగాలను తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం.

- సూర్యనారాయణరెడ్డి, పశువైద్యాధికారి, రాయదుర్గం

ప్రతి పశువుకు బీమా చేయించండి



పశు పోషకులు ప్రతి ఒక్కరూ తమ పశువులకు బీమా చేయించాలి. పశువులు మృత్యువాత పడితే రైతు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం పశుబీమా సౌకర్యం కల్పించింది. మూడేళ్లపాటు బీమా ఉంటుంది. ఇప్పటి వరకు మండలంలో 20 ఆవులు, 5 ఎద్దులు, 50 పోట్టేళ్లకు బీమా చేయించాం.

- వెంకటరెడ్డి, పశువైద్యాధికారి, బొమ్మనహాళ్

హత్యా రాజకీయాల పేటెంట్ జగన్‌దే

● హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి



పెనుకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): హత్య, శవ రాజకీయాల పేటెంట్ హక్కు జగన్మోహన్‌రెడ్డిదే అని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి బుధవారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణను రాజకీయం చేస్తూ లబ్ధి పొందాలని చూస్తున్నాడన్నారు. సొంత చిన్నాన్ననే హత్యచేసి సానుభూతి పొంది అధికారంలోకి వచ్చిన ఘనుడు జగన్ అన్నారు. ఫ్యాక్షనిజాన్ని పూర్తిగా రూపుమాపి ప్రజాస్వామ్యవాదిగా తమ నాయకుడు చంద్రబాబు నాయుడు నిలిచాడన్నారు. పోలీసుల గుడ్డలూడదీసి నడిరోడ్డుపై నిలబెడతాననటం సమంజసమా అని ప్రశ్నించారు. గత ఐదేళ్లుగా పోలీసులను అడ్డుపెట్టుకుని రాజకీయం చేసిన నీవు ఇప్పుడు అదే పోలీసులను విమర్శించడం హాస్యాస్పదం అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన నిన్ను, నీ పార్టీని ప్రజలు గుడ్డలూడదీసి రోడ్డుపై నిలబెట్టినా నీకు బుద్ధి రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుద్ధి తెచ్చుకుని ప్రజాస్వామ్యయుతంగా నడుచుకోవాలని హితవు పలికారు.

బస్సు నుంచి జారిపడి మహిళ మృతి



ఆదిలక్ష్మమ్మ మృతదేహం

చిలమత్తూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) వేగంగా వెళుతున్న బస్సు నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. లేపాక్షి-చిలమత్తూరు రోడ్డులోని ఎర్రకొండ అటవీ నర్సరీ మలుపులో ఈ ఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఆదిలక్ష్మమ్మ (55) బాగేపల్లి నుంచి హిందూపురం వెళుతున్న బాలాజీ ప్రైవేటు బస్సును చిలమత్తూరు బస్టాండులో ఎక్కింది. రద్దీ ఎక్కువగా ఉండటంతో డోరు వద్దే నిలబడింది. బస్సు ఎర్రకొండ అటవీ నర్సరీ మలుపు వద్దకు రాగానే బస్సు ముందు డోర్ వద్ద ఉన్న ఆదిలక్ష్మమ్మ కిందకు పడిపోయింది.

వెంటనే డ్రైవర్ గమనించి బస్సును ఆపాడు. తీవ్రంగా గాయపడిన అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. దీంతో బస్సు డ్రైవర్, కండెక్టర్ పరారయ్యారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరాతీశారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు అతివేగంగా నడపడం, డోర్లు వేయకపోవడం తదితర రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోవడమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతురాలు భర్త చౌడప్ప చాలాకాలం కిందటే మరణించాడు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పది మందికి ఉద్యోగోన్నతి



ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి

అనంతపురం విద్య, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ యాజమాన్యం కింద పనిచేస్తున్న 10 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించారు. బుధవారం చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి చేతుల మీదుగా జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో ఉత్తర్వులు అందజేశారు. జూనియర్ అసిస్టెంట్లు సుశీలాదేవి, రమాదేవి, అరుణశ్రీ, షహీనా బేగం, రవీంద్ర, మాధవి, సుబ్రహ్మణ్యం, ఉమా మహేశ్వరరెడ్డి, విశ్వనాథ్, మహేషకు ప్రమోషన్లు కల్పించారు. ఉత్తర్వులు అందిస్తూ జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి మాట్లాడు తూ విధుల్లో జాగ్రత్తగా ఉంటూ, సంస్థకు మంచి పేరు వచ్చేలా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ ఏవోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని చేనేత కార్మికుడి మృతి

ధర్మవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దయ్యగుట్ట సమీపంలో రైలు ఢీకొనడంతో ఓ చేనేత కార్మికుడు బుధవారం మృతిచెందాడు. హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు పట్టణంలోని సత్యసాయినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు శంకర గోవిందు (62) సిద్దయ్యగుట్టలో ఉన్న తల్లిని మాట్లాడించేందుకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో మార్గమధ్యలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో శంకర గోవిందు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి బంధువుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు. పరీక్షించి శంకరగోవిందు మృతి చెందినట్లు తెలిపారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య చౌడమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

రేపు జోయాలుకాస్ షోరూమ్ ప్రారంభోత్సవం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ గుర్తింపు పొందిన జ్యువెలరీ సంస్థ జోయాలుకాస్ అనంతపురంలో తమ రెండో షోరూమ్‌ను ప్రారంభించనుంది. ప్రీమియం సదుపాయాలు గల ఈ షోరూమ్ ద్వారా ప్రజలకు మరిన్ని కొత్తరకాల జ్యువెలరీని అందించేందుకు శ్రీకారం చుట్టనుంది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అనంతపురం నగరంలోని రాజురోడ్డులో రెండో షోరూమ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ జోయాలుకాస్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రతి ఇంటికి ఉత్తమమైన డిజైన్లను అందించడమే తమ లక్ష్యమన్నారు. చరిత్రకు పేరుగాంచిన అనంతపురంలో తమ రెండో స్టోర్‌ను ప్రారంభిస్తుండటం గర్వంగా ఉందన్నారు. స్టోర్ ప్రారంభోత్సవానికి ప్రతిఒక్కరూ హాజరై, అన్నివర్గాల వారికి అనుకూలంగా తాము అందిస్తున్న ఆఫర్లు తెలుసుకోవాలన్నారు.

పకడ్బందీగా ఎన్‌డీఏ పరీక్షలు

● కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశాలు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఈనెల 13న నిర్వహిస్తున్న నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ), నావల్‌అకాడమీ-1(2025) పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 363 మంది అభ్యర్థులు ఈపరీక్షలు రాస్తున్నారన్నారు. వీరి కోసం జిల్లా కేంద్రంలో రెండు పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయంలోగా చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేటపుడు హాల్ టిక్కెట్‌తో పాటు ఏదోఒక ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకొని అభ్యర్థులు రావాలన్నారు. మొబైల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించ మన్నారు. పరీక్షలకు నియమితులైన అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టరు ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ మలోల, జిల్లా అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, డిప్యూటీ కలెక్టర్లు రామమోహన్, తిప్పేనాయక్, మల్లికార్జునరెడ్డి, మల్లికార్జునుడు, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.25 వేలు



అనంతపురం రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 25వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.5,200, సరాసరి రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 948 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

క్షమాపణ చెప్పు జగన్..!

● వారం రోజులే గడువు..
● లేదంటే బీసీలను ఐక్యం చేసి రాజకీయ యుద్ధం చేస్తాం
● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఇతర టీడీపీ నాయకులు

అనంతపురం ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీసీ సామాజికవర్గానికి చెందిన ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌తోపాటు పోలీసు అధికారులకు మాజీ సీఎం జగన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వారం రోజుల్లో క్షమాపణలు చెప్పకపోతే బీసీలను ఐక్యం చేసి రాజకీయ యుద్ధం చేస్తామని హెచ్చరించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన లింగమయ్య కుటుంబాన్ని వైసీపీ నాయకులు ఇప్పటికీ ఆదుకునే ప్రయత్నం చేయకపోవడం ఒక బీసీ కుటుంబాన్ని అవమానించడమే నని ఆయన మండిపడ్డారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సీఎంగా పనిచేశానన్న కనీస విజ్ఞత మరిచిపోయి జగన్ మాట్లాడటం దారుణమన్నారు. ఒక రెడ్డి అక్కడ ఎస్‌ఐగా పనిచేస్తూ ఉంటే అలా మాట్లాడగలవా..? అక్కడ ఒక బీసీ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు కాబట్టే ఇష్టారాజ్యంగా మాట్లాడ వని జగన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియో కాల్ ద్వారా ఎస్‌ఐ ఎమ్మెల్యే పరిటాల సునీతతో మాట్లాడించారని ఆరోపణలు చేస్తావా..? ఏ ఆధారాలు ఉన్నాయని బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎస్‌ఐపై అభాండాలు వేస్తావని నిలదీశారు. బీసీలంటే అంత చులకనా..? అని జగన్ తీరుపై మండిపడ్డారు. లింగమయ్య హత్య కేసులో నిందితులను 48 గంటలు గడవకముందే పోలీసులు అరెస్టు చేశారన్నారు. జగన్ పాలన ఉండి ఉంటే ఇది సాధ్యమయ్యేదా..? అని ప్రశ్నించారు. చట్టం ప్రకారమే పోలీసులు స్వేచ్ఛగా పనిచేశారన్నారు. టీడీపీ ఏ నాడు నేర రాజకీయాలను ప్రోత్సహించ దని, నేరాలకు పాల్పడితే ఉపేక్షించదన్నారు. లింగమయ్య మరణాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని జిల్లాకు వచ్చిన జగన్‌కు ప్రతిపక్ష హోదా లేకపోయినా, మాజీ సీఎంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తే వైసీపీ కార్యకర్తలు చేసిందేమిటని నిలదీశారు. 250 మంది పోలీసు సంరక్షణలోని హెలిప్యాడ్‌లో మీ నాయకుడికి స్వేచ్ఛగా దిగే అవకాశం ఇవ్వలేదంటే వైసీపీ కార్యకర్తలు ఎంతటి సైకోలుగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చున్నారు. పోలీసుల మీద వైసీపీ కార్యకర్తలు రాళ్ల దాడి చేయడం దుర్మార్గమన్నారు. బీసీలకు క్షమాపణలు చెప్పకపోతే రాజకీయంగా ఇంకా పతనమైపోతావని జగన్‌ను హెచ్చరించారు. జగన్ చేసిన యాగీ.. రాజకీయ రాద్ధాంతం ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు ఎవరూ అంగీకరించరన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు వెంకటప్ప, కూచి హరి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కిరాయి గూండాల్లా ...



రామగిరి మండలంలో కిరాయి గూండాల తరహాలో వైసీపీ కార్యకర్తలు వ్యవహరించారు. 1100 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో ఉన్నారు. హెలీప్యాడ్ వద్ద 250 మంది పోలీసు సిబ్బంది సెక్యూరిటీ ఉన్నప్పటికీ వారిని లెక్కచేయకుండా వైసీపీ కార్యకర్తలు హెలిప్యాడ్‌లోకి దూసుకురావడం ఏమిటి? రామగిరికి వచ్చి సేఫ్‌గా తిరిగి వెళ్లావంటే పోలీసులే కారణం. ఒక మహిళ ఎస్పీగా ఉన్న జిల్లాలో పోలీసుల బట్టలు ఊడదీస్తానంటావా..? ఐదేళ్ల సీఎంగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి మాటలు మాట్లాడతారా..? జగన్‌కు మొదటి నుంచి శవ రాజకీయాలు చేయడం అలవాటే. ముందు మీ తల్లి, చెల్లికి న్యాయం చేసి ప్రజల్లోకి రా.

- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

శవం ఎక్కడ ఉంటే.. అక్కడ జగన్



శవం ఎక్కడ ఉంటే అక్కడ వాలిపోవడం జగన్‌రెడ్డి శవరాజకీయాలకు నిదర్శనం నీచ, హత్యా రాజకీయాలు, నిరంకుశ పాలన చేసిన జగన్ సీఎం చంద్రబాబు పాలనపై అడ్డగోలుగా విమర్శలు చేయడం సిగ్గుచేటు. నీ పాలనలో రాష్ట్రంలో 2866కుపైగా హత్యలు జరిగాయి, ఆ కుటుంబాలన్నీ కుటుంబ పెద్దను కోల్పోయి బాధలో ఉన్నారు. ఆయా కుటుంబాలను ఎప్పుడు పరామర్శిస్తావో సమాధానం చెప్పు. జగన్ పర్యటనలో సరైన భద్రత కల్పించలేదని మాట్లాడటం హాస్యాస్పదం. పోలీసుల బట్టలు ఊడదీస్తామని మాట్లాడిన జగన్‌కు శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ, అనంతపురం డీఐజీలు మహిళలనే ఇంగిత జ్ఞానం కూడా లేదు. ఇదే పోలీసులే త్వరలో నీకు, మీ పార్టీ నేతల బట్టలు ఊడదీసి, జైల్లో పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

వైసీపీ నాయకుల అరాచకం



పాపిరెడ్డిపల్లిలో జరిగిన ఘటనలో లింగమయ్య చనిపోవడం బాధాకరం. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడం మానేసి, జగన్ జేజేలు కొట్టించుకోవడం ఏమిటి? హెలీప్యాడ్‌పై ఉద్దేశ్యపూర్వకంగా వైసీపీ శ్రేణులను ఉసిగొలిపి అరాచకం సృష్టించారు. వైసీపీ నాయకులంతా అరాచకం సృష్టించేవారే. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ఆ పెట్టుబడులు రాకుండా చేసేందుకు కుట్రలో భాగంగానే టీడీపీపై జగన్ లేనిపోని ఆరోపణలు చేస్తూ అరాచకాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాడు. 2024తోనే జగన్ శకం ముగిసింది. మళ్లీ అధికారంలోకి రావడం కలే. మరో పదేళ్ల సీఎంగా చంద్రబాబునాయుడే ఉంటారు.

- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ఫెర్రర్ ఆశయ సాధనకు కృషి

● 3800 గ్రామాల్లో విన్సెంట్ ఫెర్రర్ జయంతి



హుండీలను ఓపెన్ చేస్తున్న మాంఛోఫెర్రర్ తదితరులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తన తండ్రి, ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆశయ సాధనకు మరింత కృషి చేస్తామని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ తెలిపారు. ఫాదర్‌ఫెర్రర్ 105వ జయంతి వేడుకలు బుధవారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో 3800గ్రామాలలో నిర్వహించారు. స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో ఫాదర్ విన్సెంట్‌ఫెర్రర్ ప్రత్యేకంగా చేపట్టిన ఇండియా ఫర్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 1.60లక్షలు హుండీలను మాంఛోఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్‌లు తెరిచారు. పేదలు సంపాదించి సేకరించిన మొత్తాన్ని పేద విద్యార్థుల ఉన్నత చదువులకే వినియోగించి ఫాదర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని వారు తెలిపారు. ఫాదర్ చూపిన బాటలోనే నడుస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో పేదల అభ్యున్నతికి పాటుపడుతామన్నారు. అనంతరం బత్తలపల్లిలోని ఫాదర్ సమాధి వద్ద జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర జిల్లా పర్యటన



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు సోములదొడ్డి సమీపంలోని నూతనంగా నిర్మించిన ఐఎంఎల్ డిపోను ఆయన ప్రారంభిస్తారు. ఆ తర్వాత 11.45 గంటలకు అనంతపురం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయానికి చేరుకొని, అక్కడి నాయకులు, కార్య కర్తలతో సమావేశమవుతారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో భోజన విరామం తీసుకుంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 1.30 గంటలకు శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామానికి బయలుదేరి వెళతారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అక్కడికి చేరుకొని నూతన ఐఎంఎల్ డిపో, పరిపాలన భవనాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి బెంగుళూరుకు బయలుదేరి వెళతారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

అప్పుల బాధతో..

పరిగి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి(53) అప్పుల బాధతో మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపిన మేరకు శ్రీనివాసరెడ్డి గణపతిపల్లి గ్రామంలోని సోలార్ కంపెనీలో పని చేసేవాడు. ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.30లక్షల దాకా అప్పు చేశాడు. ఈక్రమంలో రుణదాతల నుంచి అప్పు చెల్లించాలని ఒత్తిడులు ఎక్కువయ్యాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన శ్రీనివాసరెడ్డి మంగళవారం రాత్రి మేడపై గదిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జీవితంపై విరక్తి చెంది..

బెళుగుప్ప: మండలంలోని బూదివర్తిలో మంగళవారం రాత్రి ఆంజనేయులు (60) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు ఆంజనేయులు గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భార్యకు కూడా మతిస్థిమితం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామశివార్లలో వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. మృతుడికి భార్య లలితమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ...



భాగమతి (ఫైల్)

పుట్లూరు: మండలంలోని గాండ్లపాడు గ్రామంలో భాగమతి (32) కుటుంబ కలహాలతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటనరసింహం తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన భాగమతితో గాండ్లపాడు గ్రామానికి చెందిన రామేశ్వరరెడ్డికి ఏడేళ్ల కిందట వివాహమైంది. ఇతను గతంలో తాడిపత్రిలో ఫొటోస్టుడియోలో పనిచేసేవాడు. ప్రస్తుతం పొలం అమ్మగా వచ్చిన డబ్బుతో వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. అప్పు తీసుకున్నవారు సకాలంలో చెల్లించకపోవడంతో ఒత్తిడి తాళలేక మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా దిగజారింది. ఈ క్రమంలోనే దంపతుల మధ్య కలతలు మొదలయ్యాయి.

ఈ పరిస్థితులన్నింటితో మనస్తాపం చెందిన భాగమతి ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తహసీల్దార్ శేషారెడ్డి, సీఐ సత్యబాబు, ఎస్‌ఐ వెంకటనరసింహం మృతదేహాన్ని పరిశీలించి, స్థానికులతో వివరాలు ఆరా తీశారు. మృతురాలికి రెండేళ్ల కుమారుడు ఉన్నారు. మృతురాలి సోదరి భారతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొనసాగుతున్న పోలీసు పికెట్



పాపిరెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న పోలీసు పికెట్

రామగిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. మృతుడి కుటుంబాన్ని కురుబ సంఘం నాయకులు రాజహంస శ్రీనివాసులు, రిటైర్డ్ జడ్జి కిష్టప్ప తదితరులు బుధవారం పరామర్శించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు శాంతిభద్రతలపై సమీక్షిస్తున్నారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ పాపిరెడ్డిపల్లితో పాటు మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి శాంతిభద్రతలపై సమీక్షించారు. రామగిరి, కుంటిమద్ది తదితర గ్రామాలలో బుధవారం పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించబోయే డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ సుమన జయంతి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు టెట్‌లో అర్హత సాధించి వారు అర్హులన్నారు. వివరాలకు ఫోన్: 08554-275575కు సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

రేపు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా

ధర్మవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్లంబర్లకు కేటాయించిన 650-2 సర్వేనెంబరులో అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలని స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి తెలిపారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ.. అనర్హుల పట్టాలను వెంటనే తొలగించి నిజమైన ప్లంబర్ కార్మికులకు న్యాయం చేయాలని కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ కోరినా.. వారు ఎటువంటి చర్యలూ చేపట్టలేదన్నారు. దీంతో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రైతులకు విద్యుత్ పరికరాలు ఇవ్వండి

నంబులపూలకుంట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రైతులు పరికరాలు, డీపీల కోసం దరఖాస్తు చేసుకొని.. ఏడాదిగా ఎదురు చూస్తున్నారని, వాటిని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి సర్పంచ్ చంద్రకళ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రాము అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశంలో ఆమె ఇలా ప్రశ్నించారు. విద్యుత్ ఏఈ సాలేహాబాషా మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి సామగ్రి రాగానే రైతులకు అందచేస్తామన్నారు. ఎదురుదొన గ్రామ సచివాలయానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని సర్పంచ్ నాగమునినాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనప్ప, వ్యవసాయ ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, మండలాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం క్షయ వ్యాధి నిర్ధారణ సీవై, టీడీ పరీక్షలు నిర్వహించారు. క్షయవ్యాధి వారితోపాటు సన్నిహితంగాఉన్నవారికి ఆసుపత్రిలో వైద్యులు బానుప్రకాస్‌నాయక్; కమల్ రోహిత్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు చేసి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి విజయకుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు మురళీధర్, పీహెచ్ఎన్ దిల్‌షాద్, జ్యోతి, నరేంద్ర, డీటీసీ సూపర్‌వైజర్ అబీబ్‌బాషా, సిబ్బంది నాగవేణి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

ముదిగుబ్బ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ఎస్‌పీ కొట్టాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మేకల నారాయణ స్వామి(48) అనారోగ్యంతో మరణించాడు. టీడీపీ రాష్ట్ర రైతు కార్యదర్శి రమేష్‌బాబు, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, వేలూరి సూరి, అనీఫ్, వెంకటనారాయణ, బాలచంద్ర నారాయణస్వామి మృతదేహానికి బుధవారం నివాళులర్పించారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమారెడ్డిపల్లి వద్ద ఉన్న రైయింబో ఇంగ్లీష మీడియం పాఠశాలలో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ ఆటల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, జిల్లా స్పోర్ట్స్ ఇన్‌చార్జీ నరసింహనాయక్, కరస్పాండెంట్ జయసింహారెడ్డి ప్రసంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీ రాకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

కొత్తచెరువు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని, ప్రజలు సహకరించాలని కోరారు.

మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు



తాడిమర్రి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీతారమ చెన్నకేశవస్వామి మూలవిరాట్‌ను బుధవారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. దీంతో భక్తులు స్వామివారిని చూసేందుకు భారీగా తరలివచ్చారు.

అత్యాచారయత్నం కేసు నమోదు

కొత్తచెరువు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రపల్లి గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తిపై అత్యాచారయత్నం కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ సీఐ సురేశ్ తెలిపారు. అతను అత్యాచారానికి ప్రయత్నించాడని ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో చంద్రపై కేసు నమోదు చేశామన్నారు.

బాలిక అదృశ్యంపై ..

కదిరిఅర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆ బాలిక ఈనెల ఏడో తేదీ సాయంత్రం ఇంటిలో తల్లిదండ్రులు లేని సమయంలో బయటకు వెళ్లిపోయింది. తల్లిదండ్రులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో బుధవారం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రయాణీకులకు బెల్లం పానకం

తాడిమర్రి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పులివెందుల నుంచి అనంతపురం మార్గంలోని మేడిమాకులపల్లి వద్ద సుప్రమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ప్రయాణీకుల సౌకర్యం కోసం గురువారం నుంచి బెల్లం పానకాన్ని అందిస్తామని నిర్వాహకుడు వెంకటేశ్‌చౌదరి తెలిపారు. అదే విధంగా తాడిమర్రిలో కూడా మరో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ రఘురాంచౌదరి, నాయకులు బాబు, వెంకటరాముడు, రాధాకృష్ణ, బాస్కర్‌రెడ్డి, నాగభూషణంపాల్గొన్నారు.

వైద్య శిబిరంలో అధునాతన సేవలు

ముదిగుబ్బ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా మూడు రోజులుగా ఆధునిక టెక్నాలజీతో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం స్థానిక బాలుర పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఏపీడీ, ఎక్స్‌రే సేవలు, ల్యాబొరేటరీ పరీక్షలు, సాధారణ కంటి స్క్రీనింగ్‌లు, ముక్కు, నాడీ, ఎన్‌సీడీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం, ఎంపీపీ ఆదినారాయణయాదవ్, వైద్యాధికారులు సంఘమిత్ర గోశాల, కో-ఆర్డినేటర్లు ప్రదీప్, దయాకర్, ముదిగుబ్బ వైద్యాధికారులు రాజేంద్ర, శ్వేత, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలుప్రాంతాల్లో శక్తి యాప్ పనితీరుపై శక్తి టీం పోలీసులు మహిళలు, బాలికలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. యాప్‌ను వారివారి మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించారు. ఆ యాప్‌ను ఎలా ఉపయోగించాలో వివరించారు.

● ధర్మవరం: శక్తి యాప్‌పై పట్టణంలో పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి.. అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వాస్పత్రి తదితర ప్రాంతాలలో ఈ యాప్ గురించి అవగాహన కల్పిస్తూ డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాషా, కానిస్టేబుళ్లు శీనానాయక్, మురళి, ఉపేంద్ర, మహిళా కానిస్టేబుళ్లు రేవతి, అనూరాధ, శశికళ పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం

ధర్మవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రావులచెరువు సురేశ్ కేక్‌కట్ చేశారు. ఇందులో పట్టణ అధ్యక్షుడు బండారు చైతన్య, గోవర్ధన్ పాల్గొన్నారు.

వరికోతల్లోనూ దోపిడీయే..!

- యంత్రాలకు భారీ డిమాండ్
- పదుల సంఖ్యలో తమిళనాడు నుంచి తెచ్చిన యజమానులు
- సిండికేట్‌గా మారి.. ఇష్టానుసారంగా అద్దె వసూళ్లు
- అదనపు భారంతో రైతులు విలవిల
- యంత్రాలను ప్రభుత్వమే సరఫరా చేయాలని వినతి



వరికోత యంత్రం

బుక్కపట్నం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోనే పెద్ద చెరువులైన బుక్కపట్నం చెరువు కింద వరి సాగుచేసిన రైతులను వరికోత యంత్రాల నిర్వాహకులు నిలువు దోపిడీ చేస్తున్నారు. చెరువుకింద దాదాపు మూడు వేల ఎకరాలకుపైగా వరిపంటను సాగుచేశారు. ప్రస్తుత పంట కోత దశలో ఉంది. దీంతో తమిళనాడు రాష్ట్రం నుంచి పదుల సంఖ్యలో వరికోత యంత్రాలు బుక్కపట్నం వచ్చాయి. ఒక గంట వరి పంటను కోయడానికి సాధారణంగా రూ.రెండు వేలు అద్దె తీసుకుంటారు. అయితే ఇక్కడ మాత్రం రైతుల అవసరాలను బట్టి రూ.2500 నుంచి మూడు వేలు వసూలు చేస్తున్నారు. వరికోత యంత్రాల నిర్వహకులు తమిళనాడు ప్రాంత వాసులు కావడంతో సిండికెట్‌గా మారి ఇక్కడ రైతులను దగా చేస్తున్నారు. గంటకు అదనంగా రూ.వెయ్యి నుంచి రెండువేల వరకు వసూలు చేయడం దారుణమని రైతులు వాపోతున్నారు. సిండికెట్‌గా మారిని వరికోత యంత్రాల యజమానులకు స్థానికులు కొంత మంది వత్తాసు పలకడం గమనార్హం. ఈ ప్రాంత రైతులకు యంత్రాలు లేకపోవడంతో.. వ్యాపారుల చేతుల్లో రైతులు మోసపోతున్నారు. అసలే పంట పెట్టుబడులు, కూలీల ఖర్చు అధికంగా ఉంది. దీనికి తోడు వరికోతకు అదనంగా డబ్బులు ఇవ్వడం కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు. వరిపంటలు ఆదాయం రాకపోగా, అప్పులపాలై ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వమే వరికోత యంత్రాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పెట్టుబడి కూడా రావడం లేదు



వరిపంట సాగుచేయడానికి పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కాలేదు. ఎకరాలో వరిపంట సాగుచేయడానికి రూ. 40వేలు వరకు ఖర్చు అవుతోంది. వరికోతల కారణంగా ఈ రూ.40 వేలు కూడా రావడానికి కష్టంగా ఉంది.

-బాలు, రైతు, బుక్కపట్నం

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతంలో నెలకున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మదీనమసీదు వెనుక వీధి, బీఎస్ఎన్ఎల్ కాలనీవాసులు బుధవారం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. వీరికి ఆర్సీపీ నాయకులు మద్దతు తెలిపారు. మహిళలు మాట్లాడుతూ.. కొన్నిరోజులుగా నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వీటికి తోడు అరకొరగా వస్తున్న నీరు బుదరగా ఉంటోందని వాపోయారు. ఈ రాస్తారోకోతో కదిరి, హిందూపురం ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కార్యదర్శి శ్రీకాంత్ ఆందోళనకారులతో మాట్లాడారు. బురదనీరు నివారించేంత వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. అప్పటికప్పుడు ట్యాంకర్‌ను తెప్పించడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆర్సీపీ డివిజన్ కార్యదర్శి మున్నా, రైతు సంఘం రామచంద్ర, కాలనీవాసులు లడ్డుబాబ్‌జాన్, చాంద్‌బాషా, వెంకటేష్, ఫాతిమా, మైమూన్, బాబా తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న నాయకులు, మహిళలు, కొళాయిల ద్వారా వచ్చిన కలుషిత నీరు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

భూసమస్యలు పరిష్కరించండి: ఎమ్మెల్యే

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా భూ, ఆస్తి తగాదాలే అధికంగా ఉన్నాయని, రెవెన్యూ అధికారులు, పోలీసులు వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సూచించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 162 ఫిర్యాదులను ఎమ్మెల్యే స్వీకరించారు. రెవెన్యూ, పోలీసులు న్యాయబద్ధంగా ఈ సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కొత్తచెరువు తహసీల్దారు నీలకంఠారెడ్డి, పుట్టపర్తి డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్, రూరల్‌సీఐ సురేష్, పట్టణ సీఐ సునీత, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



108 వాహనంలో ప్రసవించిన శివమ్మ

ముదిగుబ్బ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ బ్రాహ్మణపల్లికి చెందిన గర్భిణి శివమ్మకు బుధవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. ఆ 108 వాహనంలో కదిరి ఆసుపత్రికి తరలిస్తుండగా.. నాగారెడ్డి గ్రామ సమీపంలోనే శివమ్మ ప్రసవించింది. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని 108 సిబ్బంది రవికుమార్, బాల ఓబిలేసు తెలిపారు.

గర్భవతులకు ఉచిత భోజనం

కదిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తలుపులలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం గర్భవతులకు మదర్ థెరిస్సా స్ఫూర్తితో మంచూర్ ఫ్రెడ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి కల్పించారు. వివిధ గ్రామాల నుంచి చికిత్స కోసం వచ్చిన దాదాపు 150 మంది గర్భవతులకు భోజనం ఏర్పాటు చేశారు. డాక్టర్లు ఎస్‌బీ అఫ్తాఫ్, ఆశ్రిత గర్భవతులను పరీక్షించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ రామానాయక్, ఎస్ఐ నరసింహుడు, మంచూర్ ఫ్రెడ్స్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



గర్భిణులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన భోజనంతో అతిథులు

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఈఓ, ఉపాధ్యాయులు

కొత్తచెరువు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కృషిచేయాలని డీఈఓ కిష్టప్ప పిలుపునిచ్చారు. బుధవారం అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ పోస్టర్లను ప్రతి పాఠశాలకు అందించాలని, ప్రభుత్వ బడుల్లో అందే విద్య సౌకర్యాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందులో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, పెనుకొండ డీఐఈఓ పద్మప్రియ, జిల్లా కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్ ఫెర్రర్ జయంతి



బత్తలపల్లి : ఫాదర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న అన్నె ఫెర్రర్

బత్తలపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్‌సెంట్ ఫెర్రర్ 105వ జయంతి సందర్భంగా బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆసుపత్రిలోని ఫాదర్ ఘాట్ వద్ద ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నె ఫెర్రర్ బుధవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీ ప్రేమీల, నిర్వహణ మేనేజర్ హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్: ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ 105వ జయంతి వేడుకలను మండలంలోని గొట్లూరు, రేగాటిపల్లి, నేలకోటతండాతో పాటు పలుగ్రామాల్లో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆర్డీటీ బత్తలపల్లి ఆసుపత్రి ప్రతినిధి శర్మ, అనంతపురం ఆర్డీటీ ప్రధానకార్యాలయ ప్రతినిధి ప్రసన్న హాజరయ్యారు. పలు గ్రామాల్లో ఆర్డీటీ సంస్థ మహిళ సంఘాలు ఏర్పాటు చేసిన హుండీలను పగలగొట్టి ఆ డబ్బును విరాళంగా ఇచ్చారు.

● కదిరి: నల్లచెరువులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫెర్రర్ జయంతిని వినాయక వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, రెడ్డెప్ప, ఎస్ రెడ్డెప్ప, గణేష్ పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శివరాంప్రసాద్‌రెడ్డి

కొత్తచెరువు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీఓగా శివరాంప్రసాద్‌రెడ్డిని నియమించారు. దీంతో బుధవారం ఆయన కొత్తచెరువు ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. గురువారం ఆయన బాధ్యతలు చేపడతారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నటరాజ్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు.

పెట్రో ధరలు తగ్గించాలి

ధర్మవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్, పెట్రో, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో నిరసన చేపట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మరింత ఆర్థిక భారాలను మోపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పెంచిన పెట్రో ధరలను తగ్గించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ నాయకులు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాఆయణ, హైదర్‌వలీ, చేనేత నాయకులు హరి, వెంకటస్వామి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచడంపై సీపీఎం నాయకులు స్థానిక బస్టాండ్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి ఆటోను తాడుతో లాక్కుంటూ వెళ్లి బస్టాండ్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, పక్కీరప్ప, పోతలయ్య, రఫీ పాల్గొన్నారు.



ముదిగుబ్బ: రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

చుక్కల భూముల సర్వే

కదిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదో వార్డులోని అడపాలవీధిలో కొన్నిసంవత్సరాలుగా దాదాపు పది ఎకరాల భూమి చుక్కల భూమి కింద ఉంది. ప్రస్తుతం ఈ భూమిలో అనేక వంద ఇళ్లు నిర్మించారు. ఈ భూమి చుక్కల భూమిగా నమోదు కావడంతో ఇళ్లు కట్టుకున్న యజమానులకు బ్యాంక్ రుణాలు కానీ, ఇతర ఆర్థిక లావాదేవీలు జరగడంలేదు. దీంతో ఆ వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఐదు వార్డు టీడీపీ ఇన్‌ఛార్జీ ఇమ్రాన్ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూమిని వెంటనే సర్వే చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. దీంతో ఆ భూమిని అధికారులు బుధవారం సర్వే చేశారు. సర్వేలో కదిరి వీఆర్ఓ ఇనయతుల్లా, పలువురు వీఆర్ఓలు ఉన్నారు.

అందుబాటులో ఆర్టీఏ సేవలు

ధర్మవరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రాణి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ధర్మవరంరూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ధర్మవరం డివిజన్ ప్రజలకు ఇటీవల ధర్మవరం మార్కెట్‌యార్డులో కొత్తగా మోటరు వాహనాల తనిఖీ కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని ద్వారా వాహనదారులకు ఆర్టీఏ సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. పూర్తి వివరాల కోసం ధర్మవరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) కె.రాణితో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ నిర్వహించింది. వాటి వివరాలు...

ప్రశ్న: ఈ కార్యాలయంలో ఎలాంటి సేవలు అందిస్తున్నారు..?

జవాబు: వాహనదారులకు ఎల్ఎల్ఆర్‌లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, లైసెన్స్‌లు రెన్యువల్స్, ఎఫ్‌సీ సర్టిఫికెట్లు, వాహనాల రిజిస్ట్రేషన్లు, తదితర సేవలు ఇక ఇక్కడే అందిస్తున్నాం. డ్రైవింగ్ లైసెన్స్ కోసం ముందుగా ఎల్ఎల్ఆర్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తరువాత కంప్యూటర్‌లో డ్రైవింగ్ టెస్ట్, కార్యాలయం ఎదుటే నిర్వహించే టెస్టులో ఉత్తీర్ణత అయితే డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తాం. గతంలో ఈ సేవల కోసం అనంతపురం, హిందూపురం, కదిరికి వెళ్లాల్సి ఉండేది. ఇక ఆ సేవలు ఈ కార్యాలయం నుంచే అందిస్తున్నాం.

ప్రశ్న: ఏ ఏ మండలాలు దీని పరిధిలోకి వస్తాయి..?

జవాబు: మా కార్యాలయం పరిధిలోకి ధర్మవరం డివిజన్‌లోని ధర్మవరం పట్టణం, రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలు వస్తాయి.

ప్రశ్న: వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) ఎలా పొందాలి..?

జవాబు: వాహనదారుడు తమ వాహనాన్ని తప్పనిసరిగా మా కార్యాలయం వద్దకు తీసుకురావాలి. వాహనాల ఇన్సురెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకురావాలి. ఎం-వాహన యాప్ ద్వారా కార్యాలయ పరిసరాల్లోనే 100 మీటర్లలోపు వాహనాల ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తాం. ఆ యాప్‌లో ఫిట్‌నెస్‌కు సంబంధించి ఫొటోలు అప్‌లోడ్ చేసి సర్టిఫికెట్ జారీ చేస్తాం.

క్రైం న్యూస్..

వెల్డర్ అనుమానాస్పద మృతి

మృతదేహంతో బంధువుల రాస్తారోకో



మృతదేహంలో రాస్తారోకో చేస్తున్న బంధువులు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మరణించిన ఇగలూరు గ్రామానికి చెందిన వెల్డర్ రహం తుల్లా (30) కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి బంధు వులు బుధవారం రాత్రి కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై మృతదేహంతో రాస్తారోకో చేశారు. వారు, సీఐ నరేంద్రరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రహంతుల్లా మండలంలోని బాబాసాహెబ్ పల్లి వద్ద సురేంద్ర కోళ్లఫారం షెడ్‌కు వెల్డింగ్ పనికి బుధవారం వెళ్లాడు. పనిచేస్తూ కుప్పకూలిపోయాడు. వెంటనే ఓడీసీ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే అతను మర ణించినట్లు వైద్యులు తెలిపారు. కోళ్లఫారం యజమాని సురేం ద్రనే రహంతుల్లా మృతికి కారమణమని,మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో సీఐ నరేంద్రరెడ్డి ఆందోళనకారులకు సర్దిచెప్పారు. రహంతుల్లాకు భార్య అమ్మజాన్, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆటో బోల్తా - మహిళా కూలీ మృతి

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడపల్లి పెద్దతండా సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో వ్యవసాయి మహిళా కూలీ రాధమ్మ (36) మరణించింది. పెడపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయి కూలీలు తొమ్మిదిమంది అదే గ్రామానికి చెందిన ఫారూక్ ఆటోలో బుధవారం ఉదయం మార్లపల్లి వద్దకూ కూలి పనులకు బయలుదేరారు. మార్గమధ్యలో పెడపల్లి పెద్దతండా వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న రాధమ్మకు తీవ్రగాయాలు కాగా ధర్మవరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించింది. ఆ ఆటో ప్రయాణిస్తున్న మోహినికి కాలు, గొల్లకేశవ భార్యకు చేయి విరిగింది. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని మరో ఆటోలో పుట్టపర్తి ఆస్పత్రికి తరలించారు. పుట్టపర్తి రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు.



భూమిపూజ చేస్తున్న నాయకులు

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ముదిగుబ్బ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్డెర్ల కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి టీడీపీ, బీజేపీ నాయకులు బుధవారం భూమి పూజ నిర్వహించారు. పంచాయతీ నిధులతో 151 మీటర్లు సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు కార్యదర్శి రమేష్‌బాబు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, బీజేపీ నాయకులు సోమల ప్రకాష్, సర్పంచ్ లక్ష్మీదేవి చంద్రాయుడు, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి : మంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : సకాలంలో లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత డీలర్లకు సూచించారు. బుధవారం స్థానిక మడకశిర రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని స్టోర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ, పౌరసరఫరాల అధికారులు, తహసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.

గోరంట్లలో నేడు మంత్రి పర్యటన

గోరంట్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని టీడీపీ మండల కన్వీనర్ సోము శేఖర్ తెలిపారు. గోరంట్లలోని చౌడేశ్వరి కాలనీలో ఉదయం 10 గంటలకు తాగునీటి బోరుకు భూమి పూజ, సచివాలయం -4లో ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభిస్తారని అన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తారని వివరించారు. మధ్యాహ్నం 2 గంటలకు పాలసముద్రం సమీపంలోని ఎస్‌బీసీఎల్ పరిపాలన భవనాన్ని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి ప్రారంభిస్తారని అన్నారు.

భర్త మోసంపై ఫిర్యాదు

గోరంట్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినాయక్ నగర్‌లో నివాసముంటున్న నాగవేణి భర్త నరేష్ మోసం చేసి, మరో పెళ్లి చేసుకున్నాడని పోలీస్‌స్టేషన్‌ల్ బుధవారం ఫిర్యాదు చేశారు. నాగవేణి, నరేష్ 2023లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. నాగవేణికి అప్పటికే పెళ్లి అయి విడిపోయినట్లు పోలీసులు తెలిపారు. నరేష్ స్థానికంగా మరో మహిళను ఇటీవల పెళ్లి చేసుకున్నాడు. తనను వేధించడంతోపాటు మోసం చేసుకుని మరోపెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదు చేయడంతో నరేష్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.

డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించనున్న డీఎస్సీకి ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు ఏఎస్‌డబ్ల్యూఓ సుబ్బరాయుడు తెలిపారు. కోచింగ్ బీసీ, ఈబీసీ అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెట్ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. టెట్ అర్హత మార్కుల జాబితా, నేటివిటీ సర్టిఫికెట్, కుల, ఆదాయ, ఆధార్ ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు ఆన్‌లైన్ ద్వారా పంపాలని, ఏప్రిల్ 15వ తేదీలోగా పంపాలని తెలిపారు. వివరాలకు 9392141545ను సంప్రదించాలన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు



ప్రతిభా వంతులకు ఉపకరణాలు అందిస్తున్న ఎంఈఓ

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రంలోని విభిన్న ప్రతిభా వంతులకు బుధవారం ఎంఈఓ గంగప్ప ఆధ్వర్యంలో రూ. 2.65లక్షలు ఉపకరణాలు వితరణగా అందించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఉపకరణాలను ఎంపిక చేసిన ప్రతిభా వంతులకు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం వికలాంగులకు అన్ని రంగాల్లో రాణించాలనే మంచి ఆలోచనతో ఎంతగానో తోర్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో భవితా కేంద్ర ఉపాధ్యాయులు లలిత, నందిని, ఎంజీఎం హెచ్‌ఎం సామ్రాజ్యం హాజరయ్యారు.

17 నుంచి పంట రుణాలు రెన్యువల్ చేసుకోండి

అగళి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులు ఈనెల 17 నుంచి రెన్యువల్ చేసుకోవాలని మేనేజర్ రవిచంద్ర తెలిపారు. గ్రామాల వారీగా రైతులు తీసుకున్న రుణాలు తీసుకున్న తేదీలను ప్రకటిస్తామని అన్నారు. బ్యాంక్ దగ్గర కూడా ఏఏ తేదీలలో రెన్యూవల్ ఉంటుందో నోటీసు బోర్డులో తెలియజేస్తామని పేర్కొన్నారు. రెన్యువల్ చేసుకునే రైతు కొత్తగా 1బి, ఆధార్, బ్యాంక్ పాసుపుస్తకం జెరాక్స్ తీసుకురావాలన్నారు. ప్రతి రైతు రెన్యువల్ చేసుకోవాలని మేనేజర్ సూచించారు. రెన్యువల్ చేసుకుంటేనే పావలావడ్డీ, సున్నా వడ్డీ లాంటివి వర్తిస్తాయన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

రొళ్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం కింద పండ్లతోటల పెంపకానికి రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీడీ లక్ష్మీనారాయణ, ఏపీఓ ఓబులప్ప తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలను పెంచి ప్రతి వేతనదారుడికి రూ.307 దినసరి వేతనం వచ్చేటట్లు చేయించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పండ్ల తోటల పెంపకం కోసం రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సిబ్బందికి తెలియజేశారు.

వాల్మీకి విగ్రహ నిర్మాణానికి విరాళం

పరిగి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనాపురం గ్రా మంలో నూతనంగా నిర్మించిన వాల్మీకి విగ్రహానికి చుట్టు కంచె ఏర్పాటు చేయడానికి దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, బీజేపీ నాయకుడు పరిగి వేణుగోపాల్‌రావు రూ.25వేలు విరాళం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆధ్వర్యంలో చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మూర్తి, శివ, శీన, సంపత్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కును ఇస్తున్న పరిగి వేణుగోపాల్‌రావు, జీఎం శేఖర్

గత పాలకుల నిర్లక్ష్యం.. జలాలు ఆలస్యం

● చెట్లు, పూడికతో నిండిన కాలువ ● సోమందేపల్లి వద్ద మరమ్మతులు ● మరో 15 రోజుల్లో మడకశిరకు కృష్ణమ్మ నీళ్లు



సోమందేపల్లి వద్ద గండి పడిన కాలువ (ఫైల్), హంద్రీనీవా కాలువలో పెరిగిన కంపచెట్లు, పేరుకుపోయిన పూడిక

మడకశిర, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నీటిపారుదల శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీనివల్ల హంద్రీనీవా కాలువలకు గండ్లు పడుతుండడంతో కృష్ణానది జలాలు మడకశిర ప్రాంతానికి రావడానికి ఆలస్యమవుతోంది. కాలువలకు గండ్లు పడకపోయి ఉంటే కృష్ణానది జలాలు ఇప్పటికే మడకశిర ప్రాంతంలోని చెరువులకు చేరేవి. గత ఐదు సంవత్సరాలుగా కాలువల్లో పేరుకుపోయిన పూడిక, కంపచెట్లు తొలగించలేదు. వర్షాలకు కోతకు గురైన కాలువలకు మరమ్మతులు చేయలేదు. ప్రస్తుతం కృష్ణానది జలాలు చెరువులకు వదలడంతో నీటి ఉధృతికి కాలువలకు గండ్లు పడుతున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హంద్రీనీవా కాలువలలో కంప చెట్లు, పూడిక తొలగించడానికి అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. సంబంధిత అధికారులు పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాలకు సంబంధించి రూ. 6 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఒక్కొక్క నియోజక వర్గానికి రూ.2 కోట్ల చొప్పున అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ప్రస్తుతానికి హిందూపురానికి రూ.20 లక్షలు, మడకశిరకు రూ.6 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో కాలువలకు గండ్లు పడిన చోట మరమ్మతులు, కంప చెట్లను తొలగిస్తున్నారు. సోమందేపల్లి వద్ద పడిన గండి పూడ్చి నీటిని కాలువలకు వదిలారు.

పెరిగిన చెట్లు.. పేరుకుపోయిన పూడిక

నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత కృష్ణానది జలాలు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు గత నెలలో విడుదల చేశారు. పెనుకొండ తరువాత హిందూపురం, అనంతరం మడకశిర ప్రాంతంలోని చెరువులకు చేరుతాయి. మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరు వదిలి రెండు నెలలు కావస్తోంది. సోమందేపల్లి వద్ద గండి పడడంతో నీటి రాక ఆలస్యమైంది. గండిని పూడ్చి వేశారు. మరో 15 రోజుల్లో మడకశిర ప్రాంతంలోని చెరువులకు నీరు చేరుతుందని సంబంధిత అధికారులు అంటున్నారు. కేటాయించిన 28 రోజుల్లో వీలైనన్ని చెరువులు నింపుతారు. మడకశిర నియోజకవర్గంలో 120 చెరువులు ఉన్నాయి. గతంలో ఐదు చెరువులు కృష్ణానది జలాలతో నింపారు. మూడు సంవత్సరాలుగా కృష్ణమ్మ నీటి కోసం రైతన్నలు ఎదురు చూస్తున్నారు. ఇరిగేషన్ పరిధిలో 47 పెద్ద చెరువులు ఉన్నాయి. చిన్న చెరువులు, కుంటలు 73 దాకా ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మొదటిసారిగా కృష్ణానది జలాలతో మడకశిర ప్రాంతంలోని నాలుగు చెరువులను నింపారు. రెండు సంవత్సరాల క్రితం ఐదు చెరువులను కృష్ణానదిజలాలతో నింపారు. మళ్లీ ఇప్పుడు నీటికోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

రూ.6 కోట్లతో ప్రతిపాదనలు : నాగార్జున, ఏఈ, హెచ్‌ఎన్ఎస్ఎస్

హంద్రీనీవా కాలువల మరమ్మతులు, కంపచెట్లు, పూడిక తొలగించడానికి రూ.6 కోట్లతో అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపుతున్నాం. హిందూపురం, మడకశిర నియోజకర్గాలలో కాలువల తాత్కాలిక మర్మతులకు రూ. 26లక్షలు మంజూరయ్యాయి. మడకశిరకు రూ.6 లక్షలు, హిందూపురానికి రూ.20లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నాం. మరో 15 రోజుల్లో కృష్ణానది జలాలు మడకశిరకు రానున్నాయి.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే



సమస్యలను అడిగి తెలుసుకొంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రథమ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా అనేక మంది పాల్గొని వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. కొంత మంది అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారని, ఇలాంటి వాటిని సహించేది లేదని ఘాటుగా హెచ్చరించారు. రైతులను ఇబ్బంది పెట్టే అధికారులకు తమ నియోజకవర్గంలో స్థానం ఉండబోదన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మార్కెట్‌యార్డు చైర్మన్ గురుమూర్తి, పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. ఇద్దరికి తీవ్రగాయాలు



మృతిచెందిన సీజే ఆంజనేయులు

అగళి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడగుంటనహళ్లి గ్రామం క్రాస్ సమీపాన జాతీయ రహదారిలో బుధవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ శ్రీరాములు తెలిపారు. పోలీసుల తెలిపిన మేరకు.. మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని వడ్రపాళెం గ్రామానికి చెందిన సీజే ఆంజనేయులు(42) అక్కడికక్కడే మృతిచెందగా, డొక్కపల్లికి చెందిన రాకేష్, రంగనాథ్‌కు తీవ్ర గాయాలైనట్లు ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు. డొక్కలపల్లికి చెందిన రంగనాథ్ బైక్‌ను నడుపుతుండగా రాకేష్ వెనుక కూర్చున్నాడు. ఆంజనేయులు బెంగళూరు నుంచి రేషన్ సరుకుల తీసుకోవడానికి తమ గ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ శ్రీరాములు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులు రాకేష్, రంగనాథ్‌ను శిర ఆసుపత్రికి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి మొదటి భార్య రత్న, రెండో భార్య లీలావతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కారు,ఆటో ఢీ.. 9 మందికి గాయాలు



పాలసముద్రం వద్ద ప్రమాదానికి గురైన కారు, తీవ్రంగా గాయపడిన అంజి

గోరంట్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి కూడలి సమీపంలో కారు ఆటోను ఢీకొన్న ఘటనలో బుధవారం 9 మంది గాయపడ్డారు. బెల్లాలచెరువుకు చెందిన ఆటో డ్రైవర్ ఆంజనేయులు కొత్తూరు సమీపంలోని పరిశ్రమ నుంచి కొంతమందిని పాలసముద్రం క్రాస్‌కు తీసుకొస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. హైవేలో బెంగుళూరువైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొని కారు పల్టీలు కొడుతూ డివైడర్‌ను దాటి బెంగుళూరు నుంచి వస్తున్న మరోకారును ఢీకొనడంతో మూడు వాహనాలు దెబ్బతిన్నాయి. ఈప్రమాదంలో మొత్తం తొమ్మిది మంది గాయపడగా, ధర్మవరానికి చెందిన అంజికి రెండుకాళ్లు విరిగాయి. కడప జిల్లాకు చెందిన సురేష్, ఆటో డ్రైవర్ ఆంజనేయులతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై ఇరువైపుల గంటపాటు రాకపోలు నిలిచిపోవడంతో సీఐ శేఖర్ సంఘటనాస్థలానికి చేరుకుని రాకపోకలపై చర్యలు చేపట్టారు.

గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎడాపెడా పెంచిన గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి మూడోసారి వచ్చిన తరువాత ప్రజల నడ్డి విరిచే విధంగా వంట గ్యాస్‌ను విపరీతంగా ధరలు పెంచారని మండి పడ్డారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో నిత్యావసర సరుకులు కూడా విపరీతంగా పెరిగిపోయాయని, సామాన్యులు కడుపు నిండా అన్నం తినే పరిస్థితి కూడా లేకుండా చేశారని పేర్కొన్నారు. కులమతాల మధ్య చిచ్చు రేపుతూ ప్రజల దృష్టి మరల్చేలా చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు హరి, రాము, రామకృష్ణ, రాజప్ప, బాబావలి, నందీశ్వరప్ప, రామాంజినప్ప, జ్యోతమ్మ, రమణ, మూర్తి, జయరాములు, చంద్రమ్మ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

రొళ్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కనపల్లి వడ్రహట్టి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మదేవి ఆలయ భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాస మూర్తి, పాండురంగప్ప, దాసిరెడ్డి, నాగరాజు, రాజన్న పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

పెనుకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం చేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ ప్రతాప్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలోని చెత్తాచెదారాన్ని బుధవారం తొలగించారు. చెట్లకు పాదులు చేసి నీరు పెట్టారు. కార్యక్రమానికి హాజరైన ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ.. విద్యార్థులు రాబోయే పరీక్షా కాలంలో కూడా శ్రమదానం చేయడం అభినందనీయమన్నారు. చదువుతోపాటు ఇలాంటి కార్యక్రమాలు చేయాలని సూచించారు. మొక్కలను నాటి వాటిని పరిరక్షించడం అందరి బాధ్యత అన్నారు.

కబ్జాకోరుల నుంచి ఆలయ భూమిని కాపాడండి



కబ్జా చేసిన స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును చూపుతున్న గ్రామస్థులు

సోమందేపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆలయ భూమిపై కన్నేసిన కొందరు కబ్జాకోరులు నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నిస్తున్నారని గుడిపల్లి గ్రామస్థులు ఆరోపించారు. ఆలయ భూమిని కబ్జాకోరుల నుంచి కాపాడాలని కోరారు. మండలంలోని గుడిపల్లి సజ్జకంత రంగనాథ స్వామి కోనేరు స్థలం సర్వేనంబరు 27-11లో 83 సెంట్లు ఉందన్నారు. ఇందులో కొంతస్థలాన్ని స్థానికంగా ఉన్న ఓ కుటుంబం కబళించడానికి ప్రయత్నించడంతోపాటు ఏకంగా ఇల్లు నిర్మించడానికి పూనుకోవడంతో రెండు నెలల క్రితం తాము అడ్డుకున్నామని అన్నారు. స్థలాన్ని సర్వే చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కె. రంగప్ప, సీవీ లక్ష్మీనారాయణ, ఎస్ఆర్ వెంకటప్ప, కె. రమణప్ప, ఎ. రమేష్, రంగనాథ్, జీవీ భాస్కర్, రంగప్ప మాట్లాడుతూ.. ఇటీవల సర్వే చేపట్టిన అధికారులు ఆలయ భూమిని నిర్ధారించారన్నారు. ఆక్రమణదారుడిపై ఈఓ ఈశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఆయన స్పందించి ఆక్రమణదారుడిని గతంలో హెచ్చరించారని అన్నారు. ఈ నేపథ్యంలో ఆలయ భూమిలోకి ఎవరైనా చొరబడినా, ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మందలించినట్లు తెలిపారు. వేరెవరూ ఆ స్థలాన్ని ఆక్రమించుకోకుండా కంచె నిర్మించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారని వివరించారు. మంగళవారం రాత్రి కొందరు దుండగులు కంచె తొలగించి బోర్డును ధ్వంసం చేశారని తెలిపారు. గ్రామస్థులను బెదిరించారని, దీనిపై విచారణ చేపట్టి కబ్జాదారుల కోరల నుంచి ఆలయ భూమిని రక్షించాలని కోరారు. ఈ విషయమై ఈఓ ఈశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా.. సమస్య తన దృష్టికి రాలేదని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

హంద్రీనీవా కాలువకు నీటి విడుదల



హంద్రీనీవా కాలువద్వారా వెళుతున్న నీరు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా బుధవారం నీటిని విడుదల చేసినట్లు హెచ్‌ఎన్ఎస్ డీఈ రామసుబ్బయ్య తెలిపారు. గొల్లపల్లి నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ మీదుగా పెనుకొండ చెరువుకు నీరు విడుదల చేసిన సందర్భంగా మార్చి 1న కాలువకు గండి పడింది. అప్పటి నుంచి నీటిని నిలుపుదల చేశారు. హెచ్‌ఎన్ఎస్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన సోమందేపల్లి వద్ద గండిపడిన కాలువను మరమ్మతులు చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం 1.93 టీఎంసీలు కాగా 0.653 టీఎంసీల నిలువ ఉందని డీఈ తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో 0.353 టీఎంసీలు డెడ్ స్టోరేజ్ అని, అంతవరకు నీటిని విడుదల చేసుకోవచ్చన్నారు. పెనుకొండలో దాదాపు 17 చెరువులు, హిందూపురంలో సగం చెరువులు నిండాయని తెలిపారు.

రైతులకు న్యాయం చేయండి



ఐక్యత చాటుతున్న ప్రజా సంఘాల నాయకులు, రైతులు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కొండూరు, కొర్లకుంట పరిసర ప్రాంతాలలోని రైతుల భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులు, కొంత మంది ప్రజా ప్రతినిధులు చేతివాటం ప్రదర్శించారని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని పాండురంగ నగర్‌లోని కనకదాసు కల్యాణ మండపం నందు కొండూరు, కొర్లకుంట రైతులతో కలిసి ప్రజా సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరక్షరాస్యులైన దళితుల భూములను చట్ట వ్యతిరేకంగా కుశలవ ఆర్గానిక్ ప్రొడక్స్ అనే సంస్థకు కట్టబెట్టారని విమర్శించారు. ఇందులో 150 మంది రైతులకు సంబంధించిన 250 ఎకరాల భూమిని అడ్డదారుల్లో ఆక్రమించారని తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా వివిధ రూపాల్లో రైతులు పోరాటాలు చేస్తున్నారని, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రమణ, గోపాలకృష్ణ, సాకే హరి, శివరామకృష్ణ, శ్రీనివాసులు, గంగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరి, జెడ్పీ శ్రీనివాసు లు, ఉదయ్‌కుమార్, ఉమర్‌ఫరూక్, వినోద్‌కుమార్, రామాంజనేయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి లక్ష్మీ నిడిమామిడమ్మదేవి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనిడిమామిడమ్మదేవి

మడకశిర రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో జమ్మానిపల్లిలో వెలసిన లక్ష్మీ నిడిమామిడమ్మదేవి ఉత్సవాలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం మహాగణపతి పూజ, కలశ స్థాపన, లక్ష్మీనారాయణ హోమం, శనివారం ఉదయం కలశ అర్చన, పంచామృత అభిషేకం, చండీ హోమం, 12 గంటలకు మహాకుంభాభిషేకం అనంతర అన్న ప్రసాదాలు నిర్వహిస్తున్నాట్లు తెలపారు. సాయంత్రం గ్రామంలో అమ్మవారి ఉత్సవాలకు ఆంధ్ర కర్ణాటక సరిహద్దు గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనున్నట్లు తెలిపారు.

రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

సోమందేపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవంలో భాగంగా వందవ రథోత్సవం సందర్భంగా 100 కిలోల ప్రసాదాన్ని తయారుచేసి స్వామివద్ద ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాకారోత్సవం, మత్స్యావతార అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

శ్రీవారి కుంభాభిషేకానికి ఆహ్వానం

మడకశిర టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలం కొత్తపాళ్యం గ్రామంలో వెలిసిన వెంకటేశ్వరస్వామి 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 30న నిర్వహించే శ్రీవారి కుంభాభిషేకం కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సవితను ఆలయ ధర్మకర్త గోవిందరాజు, సభ్యులు ఆహ్వానించారు. బుధవారం పెనుకొండలోని మంత్రి స్వగృహంలో కలిసి షిరిడీసాయిబాబా దేవాలయం ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి, బీజేపీ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ తదితరులు ఆలయ విశిష్టతను వివరించారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

హిందూపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీ షీల్డ్ తొలగించే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని, చెత్తకుప్పలు లేకుండా చూడాలని, మురుగు కాలువలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చైర్మన్ వెంట ఎంహెచ్ఓ శోభన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్, టీడీపీ నాయకులు హిదాయతుల్లా, బాబా, జియా, బాష పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి చేద్దాం

హిందూపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అధికారులు, నాయకులు సమన్వయంతో హిందూపురం మండలాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, నాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బాలకృష్ణ అధిక నిధులు తీసుకొస్తారు. వాటిని త్వరితగతిన పనులు పూర్తీ చేయాలన్నారు. విధుల్లో ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానన్నారు. నాయకులు ప్రజా సమస్యలమీదే మీ వద్దకు వస్తారు అలాంటప్పుడు వారి పనులను త్వరితగతిన పూర్తీచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారుల పనితీరుపై టీడీపీ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, డీటీ షైనుద్దీన్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, వాణిజ్యవిభాగం రాష్ట్ర అధ్యక్షులు అరుణాచల్‌రెడ్డి, నాయకులు హెచ్‌ఎన్ రాము పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య